RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ మంగళవారం 31.03.2026 సంపుటి : 03 సంచిక : 115 పేజీలు : 08 వెల : రూ.5

తెలుగు దినపత్రిక

Karimnagar Tuesday 31.03.2026 Volume: 03 Issue 115 Pages 08 Cost 5/

తెలంగాణ శాసనమండలి నుంచి

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీల సస్పెన్షన్



**హైదరాబాద్, మార్చి 30:** తెలంగాణ శాసనమండలి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సస్పెండ్ అయ్యారు. మండలి ప్రతిపక్ష నేత మధుసూద నాచారి, తాతా మధు సహా బీఆర్ఎస్ సభ్యులను చైర్మన్ గుత్తా సుఖేం దర్ రెడ్డి సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయినప్పటికీ బీఆర్ఎస్ సభ్యు లు సభలోనే ఉండి నిరసనకు దిగారు. సీట్లపైకి ఎక్కి మరీ నిరసన తెలపడంతో వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. పొంగులేటి శ్రీని వాస్ రెడ్డిని వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు.బీఆర్ఎస్ సభ్యులను బయ టకు పంపాలని మార్షల్స్‌కు చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో మార్షల్స్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. 'గెట వుట్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశా రు. 'మీలాంటి వారు సభకు రావడం సరికాదు. పెద్దల సభ గౌరవం కాపాడాలి' అని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.



2లో..

## ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే హేట్ స్పీచ్ బిల్లు

- ఈ బిల్లు పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'
- విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలు
- ఈ బిల్లు చట్టరూపం దాల్చితే భావప్రకటన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తల లక్ష్యంగా బిల్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు.

# నక్సల్స్ విముక్త భారత్

## దేశంలో నక్సలిజం తుడిచిపెట్టుకపోయింది

- 75 ఏండ్లు నక్సల్స్‌ను పెంచి పోషించింది కాంగ్రెస్ పార్టీనే
- అడవి బిడ్డలను అభివృద్ధికి దూరం చేసింది నక్సలైట్లే
- ఆయుధాలు చేత పట్టి పోరాడితే భారీ మూల్యం చెల్లించక తప్పదు
- లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సుదీర్ఘ ప్రకటన

దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని, మావోయిస్టు హింసాకాండకు నిలయమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ నుంచి నక్సలిజాన్ని తుడిచిపెట్టామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ ప్రభుత్వం విధించిన మార్చి 31వ తేదీ గడువు సమీపిస్తున్న వేళ సోమవారం లోక్‌సభలో అమిత్ షా 90 నిమిషాలపాటు నక్సల్ విముక్త భారత్‌పై ప్రసంగించారు.



3లో..

# వైభవ్ ఊచకోత

### భారీ విజయంతో రాజస్థాన్ బోణీ

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ ఘనంగా ఆరంభించింది. ఆల్‌రౌండ్ షోతో చెన్నై సూపర్ కింగ్స్‌ను వణికించిన రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. 128 పరుగుల స్వల్ప ఛేదనలో వైభవ్ సూర్యవంశీ(52), యశస్వీ జైస్వాల్(38 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వైభవ్ అయితే.. ఫోర్లు, సిక్సర్లతో చెన్నై బౌలర్లను హడలెత్తించాడు. 15 బంతుల్లోనే రికార్డు హాఫ్ సెంచరీతో ఈ చిచ్చరపిడుగు లక్ష్యాన్ని కరిగించగా.. యశస్వీ క్లాస్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. బ్యాటింగ్, బౌలింగ్.. రెండు విభాగాల్లో దారుణంగా విఫలమైన సీఎస్కే ఘోర పరాభవం మూటగట్టుకుంది.పంతొమ్మిదో సీజన్‌లో వరసగా రెండు భారీ స్కోర్ల మ్యాచ్‌ల తర్వాత లో స్కోరింగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ పంజా విసిరింది. ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు ముచ్చెమటలు పట్టిస్తూ భారీ విజయంతో బోణీ కొట్టింది. తొలుత సీఎస్కేను 127కే ఆలౌట్ చేసిన రాజస్థాన్.. వైభవ్ సూర్యవంశీ(52 : 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లు) మెరుపులతో స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది.




## నామినేషన్ వేసిన తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంటోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ సోమవారంనాడు తన నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆయన కొల తూర్ నియోజకవర్గంలో రోడ్‌షోలో పాల్గొన్నారు. మూడు సార్లు కొలతూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన స్టాలిన్ మరోసారి తన అదృష్టాన్ని ఇక్కడి నుంచి పరీక్షించు కుంటున్నారు.డీఎంకే, సెక్యూలర్ ప్రొగ్రసివ్ అలయెన్స్ అభ్యర్థిగా తనకు కొలతూరు నియోజకవర్గం ప్రజలు మరోసారి భారీ విజయాన్ని అందించనున్నారని నామి నేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్టాలిన్ చెప్పారు. ఈ విషయంలో తాను చాలా గట్టి నమ్మకంతో ఉన్నానని అన్నారు. ఎప్పటిలాగానే ఈసారి కూడా తమ ప్రచారం చాలా బలంగా ఉంటుందని తెలిపారు.డీఎంకే ఈ ఎన్నికల్లో 234 నియోజకవర్గాలకు గాను 164 చోట్ల పోటీ చేస్తోంది. భాగస్వామ్య పక్షాలు 70 స్థానాల్లో పో టీలో ఉన్నాయి. వీటిలో కాంగ్రెస్ 28 స్థానాల్లో, సీపీఎం 5, సీపీఎం (మార్క్సిస్ట్) 5, వీసీకే 8, ఎండీఎంకే 4 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. డీఎండీకే సహా ఇతర చిన్న పార్టీలు 10 సీట్లలో పోటీలో ఉన్నాయి.



## బిల్డప్ బాబాయ్..సూర్యా భాయ్

### ఒంటిపై బంగారం అంతా నకిలీదే : తేల్చిన ఐటీ



**హైదరాబాద్, మార్చి 30:** ఒంటి నిండా బంగారంతో నిత్యం ఇంటర్వ్యూ ఇస్తూ పాపులర్ అయిన సూర్యాభాయ్ బండా రాన్ని ఐటీ అధికారులు బయటపెట్టారు. అతడి ఒంటి మీద ఉంది అసలు బంగా రం కాదని నకిలీది అని ఐటీ అధికా రులు తేల్చారు. గోల్డ్ మ్యాన్ కొండా విజయ్ వ్యవహారం తర్వాత ఇలాంటి గోల్డ్ మెన్‌లపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా మరో 'గోల్డ్ మ్యాన్' సూర్యాభాయ్‌కు ఐటీ నోటీ సులు జారీ చేసింది. దీంతో సూర్య.. ఐటీ ఎదుట విచారణ హాజరయ్యారు. ఇక్కడే పెద్ద ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. సూర్యాభాయ్ ఒంటిమీద ఉన్న బంగారం అంతా నకిలీ అని ఐటీ అధికారులు తేల్చారు. బిల్డప్ కోసం ఒంటి నిండా గోల్డ్ ధరించి సోషల్ మీడియాలో పాపు లర్ అయ్యాడు సూర్యాభాయ్. తాను ఎప్పుడూ ఒంటి నిండా కోటి రూపాయల విలువ చేసే ఆభరణాలు ధరిస్తానని యూట్యూబ్‌లో ఇంటర్వ్యూ ఇచ్చాడు సూర్య. అయితే ఐటీ విచారణలో అవి సిల్వర్, కాపర్‌లకు గోల్డ్ కోటింగ్ చేసిన నకిలీ బంగారం అని అధికారులు గుర్తించారు.అతని హై ఎండ్ కార్ల గురించి కూడా ఐటీ అధికారులు ఆరా తీశారు. ఆ కార్లు ల్యాండ్ సెటిల్‌మెంట్ల ద్వారా వచ్చినవని విచారణలో తేలింది. అంతేకాకుండా సూర్యాభాయ్ నెలకు రూ.20 వేలు చెల్లించి అద్దె ఇంట్లో నివసిస్తున్నట్టు ఐటీ గుర్తించింది. ఈ విషయాలు వెలుగులోకి వచ్చిన నేప థ్యంలో సూర్యాభాయ్ ఆస్తులు, ఆదాయ వనరులపై ఐటీ మరింత లోతైన విచా రణ చేపట్టి నట్లు తెలుస్తోంది.

## కేజీ బంగారాన్ని సీజ్ చేసిన ఐటీ అధికారులు

### విజయ్ కుమార్

ఢిల్లీ వెళ్లినప్పుడు ఒంటిపై ఉన్న బంగారాన్ని చూసి ఐటీ అధికారులు సందేహంతో తనను విచారించారని తెలంగాణ గోల్డ్ మ్యాన్ కొండా విజయ్ కుమార్ వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లో కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ విచారణలో గోల్డ్ ఒరిజనలా? కాదా? అని తనిఖీ చేశారని చెప్పారు. అలాగే హవాలా లింకులు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించారని తెలిపారు. తాను ధరించిన బంగారానికి సంబంధించిన డాక్యుమెంట్స్ అడిగారని.. అప్పటికప్పుడు ఇంటి నుంచి పంపిన డాక్యుమెంట్స్‌ను ఐటీ అధికారులకు చూపించానని పేర్కొన్నారు. అయితే కేజీ బంగారానికి సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో.. దానిని సీజ్ చేశారని వివరించారు.తనను ఐటీ అధికారులు అదుపులోకి తీసుకున్న సమయంలో తన ఒంటిపై 3 కేజీల బంగారం ఉందన్నారు. హైదరాబాద్‌లో ఐటీ అధికారులు తన వద్ద నుంచి పాన్ కార్డుతోపాటు ఇతర వివరాలను తీసుకున్నారని తెలిపారు.

శాసన మండలి సభ్యత్వానికి

## నితీశ్ కుమార్ రాజీనామా

- సీఎం పదవికి కూడా త్వరలో రాజీనామా
- ఏప్రిల్ 9న రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం



**పాట్నా:** బీహార్ సీఎం నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి రాజీనామా చేశారు.ఇటీవల రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వదులుకున్నారు. సీఎం పద వికి కూడా త్వరలో రాజీనామా చేయను న్నారు. మార్చి 16న బీహార్ స్థానాలకు జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో నితీశ్ కు మార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయి తే రెండు సభల్లో సభ్యత్వం కలిగి ఉన్న ప్పుడు, ఏదో ఒక సభ్యత్వానికి రాజీనామా చేయడానికి 14 రోజుల గడువును రా జ్యాంగం నిర్దేశించింది.కాగా, మార్చి 30తో ఈ గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో రాజ్యసభకు ఎన్నికైన నితీశ్ కుమార్ తన శాసన మండలి సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేశారు. సీఎం పదవికి కూడా త్వరలో రాజీనామా చే యనున్నారు. ఏప్రిల్ 9న నితీశ్ కుమార్ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

# రైతులను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**నెల రోజుల్లో**
**కాలువల పనులు పూర్తి చేయాలి**
**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**



**జనోదయ, నర్సంపేట, మార్చి 30:**

రామప్ప - రంగాయి చెరువు - పాకాల ప్రాజెక్ట్ లో భాగమైన కాలువల నిర్మాణ పనులను పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులు పెడుతుందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. నర్సంపేట నియోజకవర్గ నల్లబెల్లి మండలం రుద్రగూడెంలో సోమవారం కాలువల పనులు పూర్తి చేసి పంటలకు నీళ్లు ఇవ్వాలని రైతులు నిరసన తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో గోదావరి జలాలను నర్సంపేట నియోజక వర్గానికి తరలించే క్రమంలో 3.5 టిఎంసి నీళ్లను రంగాయి చెరువుకు తరలించే పనులు విజయవంతంగా పూర్తి చేసాం అని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 2 ఏండ్లు పూర్తి ఐనా నేటికీ కాలువల నిర్మాణం పనులు పూర్తి చేయలేదు అని మండిపడ్డారు.సుమారు 87% పనులు పూర్తయినాయని, మిగిలిన పనులను పూర్తి చేయకుండా రైతుల పంటలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెడుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కాంట్రాక్టర్ కాబట్టి ఎప్పుడూ ఊర్లు ముంచుదామా, వేల ఎకరాల పంటను ముంచుదామా, అమాయక గిరిజన భూములలో ప్రాజెక్టు కట్టి పెద్ద ఎత్తున కోట్ల రూపాయలు సంపాదించుకోవాలని ఆశ మాత్రమే ఉన్నది తప్ప,కాలువల పనుల నిర్మాణం గురించి,మరమ్మతుల గురించి ఎన్నడు ఆలోచించలేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజకీయ కుట్రలు ఏమైనా ఉంటే నాపైన చేయండి కానీ రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టుపైన కాదు అని సూచించారు.కాలువల నిర్మాణం, మరమ్మతుల కోసం 40 కోట్ల నిధులు నిల్వ ఉన్నప్పటికీ పనులు చేయకుండా ఎమ్మెల్యే రైతులను మోసం చేస్తున్నారు అని మండిపడ్డారు.మిగిలిన పనులు పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి నెలరోజుల డెడ్ లైన్ పెడుతున్నామని, లేనిపక్షంలో రైతుల తిరుగుబాటును కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎమ్మెల్యే మాధవ రెడ్డి చవి చూడాల్సి ఉంటుంది అని హెచ్చరించారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నేడు మంథని సహకార సంఘం**

# సర్వసభ్య సమావేశం

**జనోదయ, మంథని:**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., మంథని యొక్క సర్వసభ్య సమావేశం నేడు (మంగళవారం) ఉదయం 11 గంటలకు నిర్వహించ తలపెట్టినట్లు సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ తెలిపారు. సంఘ కార్యాల యంలో జరిగే ఈ సమావేశానికి సంఘ అఫిషియల్ పర్సన్ ఇంచార్జి కె.అనిల్ కుమార్ అధ్యక్షత వహించనున్నారు.ఈ సర్వసభ్య సమావేశంలో సంఘ జమఖర్చులు, సోలార్ పవర్ ప్లాంట్, ఇతర అంశాలపై చర్చించి తీర్మానించనున్నట్లు తెలిపారు. కావున ఈ సమావేశానికి సంఘ సభ్యులు, రైతులు, మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పౌర హక్కుల దినోత్సవం నిర్వహణ



**జనోదయ : గంగాధర మార్చి 30:**

గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గునుకొండ యశోద అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉప తహశీల్దార్ కళావతి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్--17 ప్రకారం అంటరానితనాన్ని పూర్తిగా నిషేధించి నిర్మూలించామని తెలిపారు. సమాజంలో ప్రతి పౌరుడు సమాన హక్కులు కలిగి ఉన్నారని, అందరూ స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో కలసిమెలసి జీవించాలని సూచించారు. హోటళ్లలో రెండు గ్లాసుల విధానం గానీ, దేవాలయ ప్రవేశంలో గానీ ఎలాంటి వివక్ష చూపరాదని, అలాంటి చర్యలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. పౌరులు చట్టాలపై అవగాహన పెంచుకుని వాటిని గౌరవిస్తూ నడుచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐకేపీ, ఉపాధి హామీ ప్రాజెక్టు అధికారులు, పోలీస్ సిబ్బంది, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రటరీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు ప్రవీణ్, శ్రీనివాస్, సురేష్, రాజయ్య, మాజీ సర్పంచ్ కర్ర విద్యాసాగర్ రెడ్డి, గునుకొండ బాబు తదితరులు హాజరయ్యారు.



# ప్రజాస్వామ్య గొంతును నొక్కేందుకే హేట్ స్పీచ్ బిల్లు

- ఈ బిల్లు పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'
- విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలు
- ఈ బిల్లు చట్టరూపం దాల్చితే భావప్రకటన స్వేచ్ఛ, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తల లక్ష్యంగా బిల్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 30:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు.ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లు లోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుంది'అని కేటీఆర్ పేర్కొన్నారు.

బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. 'శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(a) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్యులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ శిక్షలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ చట్టం తీసుకురావడంలో ఆంతర్యం ఏమి టి..?'అని కేటీఆర్ ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలిం చాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190




మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# నక్సల్స్ విముక్త భారత్

## దేశంలో నక్సలిజం తుడిచిపెట్టుకపోయింది

- 75 ఏండ్లు నక్సల్స్‌ను పెంచి పోషించింది కాంగ్రెస్ పార్టీనే
- అడవి బిడ్డలను అభివృద్ధికి దూరం చేసింది నక్సలైట్లే
- ఆయుధాలు చేత పట్టి పోరాడితే భారీ మూల్యం చెల్లించక తప్పదు
- లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సుదీర్ఘ ప్రకటన



**దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని, మావోయిస్టు హింసాకాండకు నిలయమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ నుంచి నక్సలిజాన్ని తుడిచిపెట్టామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ ప్రభుత్వం విధించిన మార్చి 31వ తేదీ గడువు సమీపిస్తున్న వేళ సోమవారం లోక్‌సభలో అమిత్ షా 90 నిమిషాలపాటు నక్సల్ విముక్త భారత్‌పై ప్రసంగించారు.**


**న్యూఢిల్లీ:** దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందని, మావోయిస్టు హింసాకాండకు నిలయమైన ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ నుంచి నక్సలిజాన్ని తుడిచిపెట్టామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించేందుకు మోదీ ప్రభుత్వం విధించిన మార్చి 31వ తేదీ గడువు సమీపిస్తున్న వేళ సోమవారం లోక్‌సభలో అమిత్ షా 90 నిమిషాలపాటు నక్సల్ విముక్త భారత్‌పై ప్రసంగించారు. బస్తర్ ఇప్పుడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నదని, ఈ ఘనత భద్రతా దళాలు, రాష్ట్ర పోలీసులు, స్థానిక గిరిజన సమాజానికే దక్కుతుందని ఆయన తెలిపారు. 'దేశంలో నక్సలిజం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ప్రక్రియ మొత్తం అధికారికంగా పూర్తయిన తర్వాత దేశానికి తెలియ జేస్తాం. అయితే మన దేశం నక్సల్స్ రహితంగా మారిం దని చెప్పగలను' అని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను తిరస్కరించి ఆయుధాలు పట్టుకునే వారిని ఉపేక్షించబోమని, అటువంటి వారు మూల్యం చెల్లించాల్సిందేనని ఆయన చెప్పారు. ఏండ్ల తరబడి గిరిజన ప్రజలను చీకట్లో ఉంచారని, తమ సిద్ధాంతాన్ని వ్యాప్తి చేసేందుకు లెఫ్టిస్టులు వారిని తప్పుదోవ పట్టించా రని ఆయన విమర్శించారు. స్వాతంత్ర్యం తర్వాత 60, 75 ఏండ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ గిరిజనుల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఆరు దశాబ్దాల పాటు గిరిజనులకు ఇండ్లు, స్కూళ్లు లేదా మొబైల్ టవర్లను కాంగ్రెస్ అందుబాటులోకి తీసుకురాలేదు. కాని ఇప్పుడు మీరేం చేశారని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. 1970వ దశకం నుంచి వీటిని ఎందుకు సాధించలేకపో యారని నక్సలి జాన్ని సమర్థించే వారిని నేను ప్రశ్నిస్తున్నాను అని అమిత్ షా నిలదీశారు. బస్తర్ నుంచి నక్సలిజాన్ని దాదాపు పూర్తి గా నిర్మూలించామని, ప్రతి గ్రామంలో పాఠశాల లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలో రేషన్ షాపులు ఏర్పాటు చేశామని, ప్రతి తహసీల్ పంచాయత్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలను ఏర్పా టు చేశామని ఆయన చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గిరిజన తండాలకు అభివృద్ధి ఎందుకు చేరలేదని నక్సల్ సాను భూతిపరులను అమిత్ షా ప్రశ్నించారు. మావోయిస్టు భావజాలంతో ప్రభావితు రాలైన మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాలనలో నక్సల్బ రీలో ప్రారంభమైన ఉద్యమం 12 రాష్ట్రాలకు వ్యాపించి, 17 శాతం భూభాగాన్ని ఆక్రమించి 10 శాతానికి పైగా జనాభాను ప్రభావితం చేసిందని ఆయన ఆరోపించారు. నక్సలైట్లను భగత్ సింగ్ లేదా బిర్సా ముండాతో పోల్చడాన్ని అమిత్ షా తప్పు పట్టారు. ఇదేం బరితెగింపు అని ఆయన ప్రశ్నించారు. భగత్ సింగ్, బిర్సా ముండా బ్రిటిష్ పాలకులపై పోరాడారని, కాని నక్సలైట్లు రాజ్యాం గాన్ని ఉల్లంఘించి ఆయుధాలు చేపట్టి అమాయక ప్రజలను హతమార్చారని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందించి 4,800 మంది నక్సల్స్ లొంగిపోయారని, 2 వేల మందికిపైగా నక్సల్స్‌ను జైళ్లకు పంపామని అమిత్ షా చెప్పారు. తమ సిద్ధాంతాన్ని అనుసరించేలా గిరిజనులను నక్సల్స్ మార్చివేశారని, గిరిజనులు విద్యావంతులైతే తమతో ఉండరన్న భయంతో వారిని స్కూళ్లకు, బ్యాంకులకు, ఆరోగ్య కేంద్రాలకు దూరం చేశారని ఆయన ఆరోపించారు. నక్సల్ విముక్త భారత్ కోసం ప్రాణాలు కోల్పోయిన వేలాది జవాన్లకు ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో తమ అభ్యర్థిగా సుప్రీం కోర్టు మాజీ జడ్జి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని నిలబెట్టిన విపక్షాలపై హోం మంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. 2011 నాటి సల్వా జుడుం కేసు తీర్పును ఆయన ఖండించారు. నాటి కేసులో జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు ఇస్తూ నక్సలైట్లపై ప్రభుత్వాల పోరాటాన్ని చట్టవిరుద్ధమని ప్రకటించింది. దీని పర్యవసానాలేంటి? సల్వా జుడుం ఉద్యమంతో సంబంధం ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని నక్సల్స్ చంపివేశారు. అదే జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆ తర్వాత ఉప రాష్ట్రపతి ఎన్నికలో విపక్షాల అభ్యర్థిగా ఎంపికయ్యారు అని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఈ దేశంలో శాంతి భద్రతలను పాటించేవారు సుదర్శన్ రెడ్డిని తమ అభ్యర్థిగా ఎన్నడూ ఎంచుకోరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జర్నలిస్ట్ సంక్షేమ సంఘం

## మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రెటరీగా మారేపల్లి వేణుగోపాల్ రెడ్డి

**జనోదయ, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లాలోని కిడ్స్ ప్లే స్కూల్ ఆవరణంలో నిర్వహించిన జె ఎస్ ఎస్ జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహణ, జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన జర్నలిస్టు మిత్రులు పాల్గొని మోకనపల్లి బద్రిని మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా జన రల్ సెక్రెటరీగా సీనియర్ జర్నలిస్ట్ మారేపల్లి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా డి. వెంకటేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిరిపురం మధు, జిల్లా ఉపాధ్యక్షులుగా రాజయ్య, శనిగా రపు వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కుషనపల్లి సతీష్, మాదాసు శ్రీకాంత్ యాదవ్, బత్తుల సతీష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోకన పల్లి బద్రి మాట్లాడుతూ నా మీద నమ్మ కాన్ని ఉంచి జిల్లా అధ్యక్ష పదవి బహుకరించిన జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డికి ధన్యవా దాలు తెలియజేశారు. మంచిర్యాల జిల్లాలో పని చేస్తున్న జేఎస్ఎస్ జర్నలిస్టు సంక్షేమ సంఘం సభ్యులు అదేవిధంగా ఇతర సంఘాల జర్నలిస్టు సభ్యులకు ఏ సమస్య వచ్చినా ముందుంటానని జర్నలిస్టుల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాసాని రమేష్, సిరిపురం మధు, దుర్గం వెంక టేష్ ,కుశలపెల్లి సతీష్, డాక్టర్ స్వామి, ఠాగూర్ సుశీల్ ,శేఖర్ ,ఆంజనేయులు,శ్రీ కాంత్ యాదవ్, బీజోన్ రవి, శనిగారపు వెంకటేష్, జైపూర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత

### రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

### జైపూర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన

**జనోదయ : చెన్నూరు ఆర్సీ**




రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు సురక్షి తంగా గమ్యస్థానాలకు చేరుకోవడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం,తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు చేపట్టిన "అరైవ్ అలైవ్ ఫేజ్–3" కార్యక్ర మంలో భాగంగా ఈ రోజు సోమవారం జైపూర్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో దుబ్బపల్లి ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా , మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడు తూ,రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్ర మం ద్వారా ప్రజల్లో రోడ్డుభద్రతపై అవగాహన పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. ప్రజా ప్రగతి ప్రణాళికలో భాగంగా ట్రాఫిక్ నియమాలపై అవగా హన సదస్సులు,కంటి వైద్య శిబిరాలు మరియు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన యువకులు, కార్మికులు, విద్యార్థులు రోడ్డు భద్రతపై తెలుసుకున్న విషయాలను తమ గ్రామాలు,కాలనీలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు మరియు సహచరులకు తెలియ జేసే దూతలుగా మారాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించేలా చైతన్య వంతం చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడప కూడదని, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. మైనర్ పిల్లలకు వాహనా లు ఇవ్వకూడదని హెచ్చరిస్తూ,వారి భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచిం చారు. రాత్రి సమయంలో డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని,రోడ్డుపై నడిచే వారి ని గమనిస్తూ వాహనాలు నడపాలని సూచిం చారు. కనీస జాగ్రత్తలు పాటిస్తే రోడ్డుప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారంతో రామగుండం కమిషనరేట్‌ను ప్రమాద రహిత ప్రాంతంగా మార్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, జైపూర్ సీఐ నవీన్, చెన్నూర్ టౌన్ ఇన్స్పెక్టర్ బన్సీలాల్, చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ, జైపూర్ ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## క్షేత్ర పర్యటనలు

## విద్యార్థుల అభివృద్ధికి దోహదం చేస్తాయి



**జనోదయ : మంథని మార్చి 30:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథనిలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఎంటర్‌ప్రె న్యూర్షిప్ డెవలప్మెంట్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు విద్యార్థిని, విద్యార్థులు గోదావరిఖని ప్రాంతంలోని మనో చైతన్య మానసిక వికలాంగుల వృత్తి శిక్షణ ఉపాధి కేంద్రం మరియు సాయి గణేష్ నాన్ ఓవెన్ బ్యాగ్స్ ఎంటర్‌ప్రైజెస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కన్వీనర్ శ్రీ చాట్ల పరిషయ్య మాట్లాడుతూ క్షేత్ర పర్యటనలు విద్యార్థులలో అవగాహన పెంపొందించి వారి అభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చే సిన శాతవాహన విశ్వవిద్యాలయ రిసోర్స్ పర్సన్ డా. ఎం. మనోజ్ కుమార్ ఎంటర్‌ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ లక్షణాలను విద్యార్థులకు సవివరంగా వివరించా రు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ కోఆర్డినేటర్ మరియు ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ కర్నాటి కృష్ణ, అధ్యాపకులు శేఖర్, మానస, ఫర్జానా, రజిత పాల్గొన్నారు. అంతే కాకుండా కమిషనర్ కళాశాల విద్య గారి ఆదేశాల మేరకు డిగ్రీ అడ్మిషన్ల కోసం ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పూర్తి చేసిన స్థానిక విద్యార్థులకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డా. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కళాశాల వసతులు మరియు అందుబాటులో ఉన్న కోర్సుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం, దుర్గం కృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మంథనికి రానున్న మాజీ మావోయిస్టు మల్లా రాజిరెడ్డి?

**రాజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అల్లం నారాయణ, గోగుల రాజిరెడ్డి**



**జనోదయ, మంథని:**

మంథని ప్రాంతానికి చెందిన మాజీ మావోయిస్టు (పోలిట్ బ్యూరో సభ్యుడు) మల్లా రాజిరెడ్డిని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మంథని డివిజన్ అధ్యక్షులు గోగుల రాజిరెడ్డి, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణతో కలిసి సోమ వారం సాయంత్రం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. మంథని మండల పరిధిలోని ఎక్లాస్పూర్ గ్రామపంచాయతీ శాస్త్రులపల్లి మల్లా రాజిరెడ్డిది కాగా, అల్లం నారాయణ గాజులపల్లికి చెందినవారు. గోగుల రాజిరెడ్డి ధర్మారం (గద్దలపల్లి) గ్రామానికి చెందినవారు. వీరిలో అల్లం నారాయణ గతంలో ఉద్యమ సహచరుడు కాగా, గోగుల రాజిరెడ్డి మల్లా రాజిరెడ్డికి స్వయానా బావమరిది.

**మంథని ప్రాంతంలో పర్యటించాలని ఉంది?**

తాను పుట్టి పెరిగిన మంథని ప్రాంతంలో పర్యటించి తన బంధుమిత్రులను కలుసుకుని మాట్లాడాలని ఉందనే అభిప్రాయాన్ని మల్లా రాజిరెడ్డి వెలిబుచ్చినట్లు ఆయన బావమరిది గోగుల రాజిరెడ్డి తెలిపారు.

## నగర సుందరీకరణే తమ లక్ష్యం

### రామగుండం మేయర్ మహంకాళి స్వామి



**జనోదయ, గోదావరిఖని, మార్చ్ 30:**

నగర సుందరీకరణే లక్ష్యంగా మురుగు నీటి కాలువలను శుభ్రం చేయించే పనిలో రామగుండం నగర నగర మేయర్ మహంకాళి స్వామి నిమగ్న మయ్యారు. శనివారం నీటి సరఫరా పైప్ లైన్ లీకేజీ మరమ్మత్తు పైప్ లైన్ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ పూర్తి చేయించిన మేయర్ అదే తరహాలో మురుగు నీటి కాలువలో పూడిక తొలగింపు పనులను కూడా పర్యవేక్షిస్తున్నారు. సోమవారం తెల్లవారు ఝాముననే కార్యరంగంలోకి దిగారు . నగర పాలక సంస్థ కార్యా లయం వద్ద ప్రదాన రహదారి వెంబడి పారుతున్న పెద్ద మురుగు నీటి కాలువలో జె సి బి యంత్రం సహాయంతో పూడిక తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. క్షేత్ర స్థాయిలో దగ్గరుండి సిబ్బందికి మార్గద ర్శనం చేస్తూ కాలువ శుభ్రం చేయించారు. తొలగిం చిన పూడికను కూడా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ ద్వారా తరలించే ఏర్పాట్లు చేయించారు. ఎన్నో ఏళ్లుగా పేరు కుపోయిన పూడికను తొలగించడంలో కాలువ సాఫీగా ప్రవహిస్తున్నది.

# బాలికలు స్వశక్తితో ఎదిగేలా చేయడమే ధ్యేయం




**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)** వరంగల్ జిల్లాలోని నర్సంపేట పట్టణ కేంద్రంలోని స్థానిక సంజీవిని బాలల సదనము వసతి గృహంలో షేర్ స్వచ్ఛంద సంస్థ మరియు మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్వైవర్ నెట్వర్కింగ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ అధికారి, ఉమా మాట్లాడుతూ... వివిధ రకాల వేధింపులు మరియు కష్టాల నుండి బయటపడిన బాలికలు, మహిళలకు మానసిక ధైర్యాన్ని నింపడం, వారిని సమాజంలో స్వశక్తితో ఎదిగేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం అని తెలిపారు. సమాజంలో వేధింపులకు గురైన వారు తమను తాము భాధితులుగా కాకుండా, ఆ కష్టాలను జయించిన సర్వాయివర్స్ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. షేర్ స్వచ్ఛంద సంస్థ నిర్వకురాలు శిరీష మాట్లాడుతూ.. చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ పథకాలు స్వయం ఉపాధి మార్గాల పట్ల అవగాహన కల్పించారు. సీడబ్ల్యూసీ మెం బెర్ సాహిదా మాట్లాడుతూ.. ఈ సమావేశం బాలికల రక్షణ, సంక్షేమశీ పునరావాసం పై చర్చించెందుకు నిర్వహించామన్నారు. సమావేశంలో బాలికల హక్కులు న్యాయ పరిరక్షణ మానసిక ఆరోగ్యం సమాజంలో వారికీ అందాల్సిన మద్దతూ అంశాలపై విశ్రుతంగా చర్చించారు. భాధిత బాలికలకు సమగ్ర సహాయం అందించడానికి సంబంధిత విభాగాల మధ్య సమన్వయం అవసరమని ప్రతిపదించారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికల రక్షణపై అవగహన పెంపొందించడం మాత్రమే కాకుండా, వివిధ విభాగాల మధ్య సమన్వయశీ మరింత బలోపేతం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆశ్రమం నిర్వహిస్తున్న డైరెక్టర్ మోహన్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ICPS సుమన్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 మౌనిక షేర్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ మొబైలైజర్స్, ప్రశాంతి, కల్పన, గాయత్రి, ప్రభాకర్తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూముల కబ్జాలపై విచారణ జరపాలి

**-కట్టా మనోజ్ రెడ్డి పేరు మీద అక్రమంగా జారీ చేసిన పట్టాలను తక్షణమే రద్దు చేయాలి**

**-హన్మకొండ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన విముక్త చిరుతల కక్షి పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కన్నాల రవి**



**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)** ఐనవోలు మండలం, వెంకటాపూర్ గ్రామంలోని సర్వే నెం. 324లోని అసైన్డ్ భూమిని, 324జ, 324ఞ, 324ఙ అనే సబ్ నెంబర్లతో కట్టా మనోజ్ రెడ్డి పేరు మీద అక్రమంగా జారీ చేసిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. విముక్త చిరుతల కక్షి పార్టీ (విసికె) వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కన్నాల రవి హన్మకొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం, వెంకటాపూర్ గ్రామంలో గతంలో వ్యవసాయ భూ గరిష్ఠ పరిమిత చట్టం ప్రకారం పింగళి మధుసూదన్ రెడ్డి ఆధీనంలోని సర్వే నెం. 324లో 300 ఎకరాల భూమిని ప్రభుత్వానికి సరెండర్ చేయడం జరిగింది. ప్రభుత్వం నుండి ఆ భూములను వదులుకున్నందుకు నగదు పరిహారం కూడా సదరు భూస్వామి తీసుకున్నాడు. అప్పటి నుండి ఆ భూమి ప్రభుత్వం ఆధీనంలో ఉన్నది. ఆ భూమిని ప్రభుత్వం పేదలకు అసైన్డ్ చేసింది. కానీ 2015 తర్వాత ఆ భూమిలో 100 ఎకరాలను కట్టా మనోజ్ రెడ్డి ఆక్రమించాడు. తన పలుకుబడిని ఉపయోగించి తన పేరు మీద 60 ఎకరాల పట్టాను పొందాడు. దానితో పాటు సుమారు 20 ఎకరాలు ఇతరులకు తను అమ్మినట్టు తెలిసింది. ఇప్పటికీ సర్వే నెం. 324 జ,ఞ,ఙ లలో కట్టా మనోజ్ రెడ్డి పేరు మీద వస్తున్న భూమి అసైన్డ్ భూమి అని భూభారతి సూచిస్తున్నది.రెవెన్యూ అధికారుల సహకారం, జోక్యం లేకుండా అసైన్డ్ భూములను ప్రయివేట్ వ్యక్తి అయిన కట్టా మనోజ్ రెడ్డి పేరు మీద బదలాయించడం వీలు కాదు. అందువల్ల ఈ అక్రమ భూ బదలాయింపు మీద శాఖాపరమైన విచారణ చేపట్టాలని విసికె పార్టీ నుండి డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అలాగే తక్షణమే కట్టా మనోజ్ రెడ్డి పేరును రికార్డుల నుండి తొలగించాలని, అతనికి, అతని బినామీల పేరు మీద జారీ చేసిన పట్టా పాసుపుస్తకాలను వెంటనే రద్దు చేయాలని కన్నాల రవి డిమాండ్ చేశారు. గతంలో అసైన్డ్ చేసిన పేదలకే ఆ భూములను స్వాధీనం చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాల మీద చర్యలు చేపట్టక పోతే, విసికె ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు అంబాల అనిల్, విసికె నగర నాయకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాతో మేలు కంటే కీడు ఎక్కువ

**-గద్దర్ వేషధారణపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరుగుతోంది**

**-మహిళలపై అసభ్యకర పోస్టులను నియంత్రించాల్సిన అవసరం ఉంది**

**-గతంలో డీసీపీ, సీపీగా పనిచేసిన అనుభవం నాకు ఉంది**

**-చట్టం ప్రకారం ముందుకెళ్లాలని పోలీసు అధికారులకు సూచన**

**-ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెటా.. వారి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం**

**-వర్ధన్నపేట సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**

**-వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ) మార్చి 30** సోషల్ మీడియా వచ్చాక మేలు కంటే కీడు ఎక్కువగా జరుగుతోందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఇటీవల తాను రవీంద్ర భారతిలో గద్దర్ వేషధారణలో పాల్గొంటే దానిపైనా సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరుగుతోందని పేర్కొన్నారు. మహిళల పట్ల కూడా కొందరు విచక్షణ కోల్పోయి అసభ్యకర పోస్టులు పెడుతున్నారని, ఇటువంటి చర్యలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు.గతంలో తాను అసెంబ్లీ ఎదుట బందోబస్తు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించడంతో తాను ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగు పెట్టానన్నారు. ప్రజా ప్రతినిధిగా ఎప్పటికప్పుడు క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి మరియు ప్రజలకు మేలు జరిగే కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గతంలో డీసీపీగా, సీపీగా పనిచేసిన అనుభవంతో చట్టం ప్రకారం ముందుకు వెళ్లాలని పోలీసు అధికారులకు సూచిస్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోకి వెళ్లినప్పుడు సోషల్ మీడియా ట్రోలింగ్స్‌పై స్థానిక ప్రజలు కూడా ప్రశ్నిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం తాను ఎమ్మెల్యేగా మరింత క్రమశిక్షణతో పనిచేస్తూ.. వర్ధన్నపేట సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

